

నేడు జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల రాక

ఎరువుల సరాఫరాపై అధికారులతో సమీక్ష



ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల ఎనిమిదో తేదీ ఏలూరు రానున్నారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు కలెక్టరేట్‌లో ఎరువుల సరఫరాపై అధికారులతో సమీక్షించనున్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఎంఎల్‌ఎలు పాల్గొననున్నారు.

జిల్లాలపై కమిటీ.. ఉన్నట్టా.. లేనట్టా..!

- జిల్లాల విభజనలో లోపాలు, సరిహద్దు సమస్యలపై మంత్రులతో కమిటీ ఏర్పాటు
- నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆగస్టు 6న కేబినెట్‌లో నిర్ణయం
- గడువు దాటినా జిల్లాలో పర్యటించని కమిటీ
- గణపవరం మండలం మార్పుపై తీవ్ర అలజడి
- నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలపై ఉత్కంఠ
- 'పోలవరం ' జిల్లా ఏర్పాటు జరిగేనా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాల విభజనలో లోపాలు, సరిహద్దు సమస్యలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ ఉన్నట్టా.. లేనట్టా అన్న సందేహాలు అలుముకున్నాయి. మంత్రుల కమిటీ జిల్లాలో పర్యటించిన నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని, డిసెంబర్‌లోపు జిల్లాలకు సంబంధించిన మార్పులు, చేర్పులు పూర్తవ్వాలని ఆగస్టు ఆరో తేదీన జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం జరిగింది. నెల రోజుల్లో నివేదిక ఇవ్వడం పక్కకు పెడితే ఇప్పటి వరకూ మంత్రుల కమిటీ జిల్లాకు రాలేదు. దీంతో జిల్లాల విభజనపై ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ ఏమైందన్న చర్చ జనాల్లో కొనసాగుతోంది. గణపవరం మండలాన్ని ఏలూరు జిల్లాలో కలపనున్నట్లు ప్రచారం సాగుతుండడంతో అక్కడి నాయకులు, ప్రజల్లో తీవ్ర అలజడి నెలకొంది. అదేవిధంగా ఏలూరు జిల్లాలోని నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల ప్రజల్లోనూ ఉత్కంఠ కొనసాగుతోంది. మంత్రుల కమిటీ జిల్లా పర్యటనకు వస్తే జిల్లాల మార్పులు, చేర్పులపై వినతులు ఇవ్వాలని జిల్లాలోని పలు రాజకీయ పార్టీలు, ప్రజలు సైతం ఎదురుచూస్తున్నారు. మంత్రుల కమిటీ మాత్రం పత్తాలేకుండా పోయింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు సంబంధించిన మార్పులు, చేర్పులు చేపట్టాలని స్థానిక ప్రజానీకం కోరుతున్నారు. కైకలూరు, నూజివీడు నియోజకవర్గాల ప్రజలు తమ ప్రాంతాలను ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల్లో కలపాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్న పరిస్థితి. జిల్లాల విభజన సందర్భంగా అప్పట్లో కైకలూరు నియోజకవర్గ ప్రజలు, నాయకులంతా తమ నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలని పట్టుబట్టారు. నూజివీడు నియోజకవర్గ ప్రజలు తమ ప్రాంతాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలపాలని ఆందోళనలు సైతం చేశారు. అప్పటి వైసిపి ప్రభుత్వం పార్లమెంట్ స్థానాల ప్రాతిపదికన జిల్లాల విభజనను పూర్తి చేసింది. దీంతో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్న నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను ఏలూరు జిల్లాలో కలిపారు. తమకు జిల్లా కేంద్రం ఏలూరు రావడానికి తీవ్ర ఇబ్బందిగా ఉందని, రవాణా సదుపాయాలు సరిగ్గా లేవని తమ ప్రాంతాలను ఏలూరు జిల్లా నుంచి తప్పించాలని నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల ప్రజలు, రాజకీయ నాయకులు సైతం కోరుతున్నారు. గడిచిన ఎన్నికల్లో నూజివీడులో జరిగిన బహిరంగ సభలో ఇదే విషయాన్ని చంద్రబాబు దృష్టికి అక్కడి నాయకులు తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలుపుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పుడు ప్రజలు, నాయకులు అదే విషయాన్ని పదేపదే ప్రస్తావిస్తున్నారు. కైకలూరు నియోజవకర్గానికి చెందిన నాయకులు సైతం తమ ప్రాంతాన్ని కృష్ణా జిల్లాలో కలపాలని ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇవ్వడం కొనసాగుతోంది. జిల్లాల విభజన సమస్యలపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడంతో తమ సమస్యలు చెప్పుకోవచ్చని అంతా ఎదురుచూస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో కలిసిన గోపాలపురం నియోజవకర్గంలో ఉన్న ద్వారకాతిరుమల మండలాన్ని అప్పట్లో ప్రజాభీష్టం మేరకు ఏలూరు జిల్లాలో కలిపారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ఉన్న గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో కలిపారు. ఇప్పుడు గణపవరాన్ని తిరిగి ఏలూరు జిల్లాలో కలుపుతారన్న ప్రచారంతో అక్కడి ప్రజలు తాము ఒప్పుకునేది లేదంటూ జిల్లాకు చెందిన మంత్రులను కలిసి వినతిపత్రాలు అందించిన పరిస్థితి నెలకొంది.

'పోలవరం' జిల్లా ఏర్పాటుపై ఉత్కంఠ

ఏజెన్సీ మండలాలన్నింటినీ కలిపి పోలవరం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఏజెన్సీ మండలాలను ప్రత్యేక జిల్లాగా చేస్తే అక్కడి ప్రజా సమస్యలపై ఎక్కువ దృష్టి పెరిగే అవకాశం ఉంటుంది. కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల ప్రజలు జిల్లా కేంద్రం ఏలూరుకు రావాలంటే 120 కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సి వస్తోంది. దీంతో జిల్లా కేంద్రానికి ఉదయం బయలుదేరితే తిరిగి వెళ్లేసరికి రాత్రి అవుతోంది. తూర్పుగోదావరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఏజెన్సీ మండలాలను ప్రత్యేక జిల్లాగా చేస్తే కలెక్టర్‌తోపాటు, అధికారులంతా పూర్తిగా ఏజెన్సీ ప్రాంతంలోనే పనిచేసే అవకాశం ఉంటుంది. గిరిజనులు తమ సమస్యలను అధికారులకు చెప్పుకునే అవకాశం ఏర్పడుతుంది. దీంతో పాలనలో పారదర్శకత వచ్చే పరిస్థితి కొనసాగుతుంది. పోలవరం జిల్లా ఏర్పాటుపై ఏజెన్సీ ప్రజలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నియమించిన మంత్రులు కమిటీ పోలవరం జిల్లా ఏర్పాటు నివేదిక ఏవిధంగా ఇస్తుందోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది.

తగ్గిన గోదావరి వరద

ఇంకా ముంపులోనే గుండేటి వాగు కాజ్‌వే

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్



ముంపులోనే ఉన్న గుండేటి వాగు కాజ్‌వే

20 రోజుల నుంచి పెరుగుతూ, తగ్గుతూ వస్తున్న గోదావరి వరద ఎట్టకేలకు తగ్గుముఖం పట్టింది. భద్రాచలంలో శనివారం 35 అడుగులున్న గోదావరి ఆదివారం నాటికి 28 అడుగులకు చేరి క్రమంగా తగ్గుతోంది. గోదావరి వరద తగ్గుముఖం పట్టినా కుక్కునూరు, దాచారం మధ్య గుండేటి వాగు కాజ్‌వే ముంపులోనే ఉంది. దీంతో వాగు అవతల ఉన్న 12 గిరిజన గ్రామాల ప్రజలు గత మూడు వారాల నుంచి మండల కేంద్రానికి రావాలంటే చుట్టూ 15 కిలోమీటర్లు తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. గోదావరి వరద తగ్గుతుండడంతో మరో రెండు రోజుల్లో గుండేటి వాగు కాజ్‌వేపై నుంచి రాకపోకలు కొనసాగుతాయి.

వేలేరుపాడు రూరల్ : గోదావరి తగ్గుముఖం పట్టడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. మండలంలో గోదావరి వరదల కారణంగా గత పదిహేను రోజులుగా రహదారులు నీటమునడంతో రవాణా సౌకర్యాలు లేక జనజీవనం స్తంభించి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వేలేరుపాడు నుంచి రుద్రంకోట, రేపాకగొమ్ము వరద వీడడంతో ఆ రెండు గ్రామాల ప్రజలకు రాకపోకలు సాగుతున్నాయి. గోదావరి తగ్గుముఖం పట్టినా గానీ యడవల్లి వద్ద ఉన్న ఎద్దు వాగు కాజ్‌వే నీట మునిగే ఉండడంతో ఎడవల్లి, సిద్ధారం, టేకూరు, కోయిదా, తాళ్లగొంది, పూచి గొంది తదితర 15 గ్రామాలకు రాకపోకలు సాగడం లేదు. ఇంకా రెండు, మూడు రోజుల వరకూ రహదారి సౌకర్యం ఏర్పడదని అత్యవసర పరిస్థితుల్లో కూడా పడవలు దాటి రావాల్సి వస్తుందని, ఆ పడవలు సమయానికి ఉంటాయో ఈ ఉండవోనని ప్రజలు తల్లడిల్లుతున్నారు. వరదలకు నీట మునిగిన వరి, మినుము పంటలు ఎలా ఉంటాయోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే సంవత్సరానికైనా ఈ గోదావరి వరదల నుంచి ప్రజలకు పూర్తి పరిష్కార మార్గం చూపించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

రైతుల అవసరాల మేరకు ఎరువులు ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు



మాట్లాడుతున్న కలెక్టర్

రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులు అందించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో రైతులకు ఎరువుల పంపిణీపై ఆదివారం వ్యవసాయ శాఖ, సహకార, మార్క్ ఫెడ్ అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రైతులకు ఎరువుల పంపిణీలో జిల్లాలో ఎక్కడా ఎటువంటి సమస్యలూ లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. గ్రామ స్థాయిలో వ్యవసాయాధికారులు రైతులతో మాట్లాడి మమేకమవ్వాలన్నారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై రైతులకు అవగాహన కలిగించాలన్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని, ఈ నెల 10, 13వ తేదీల్లో మరో వెయ్యి టన్నుల యూరియా జిల్లాకు రానుందని తెలిపారు. ఎరువుల పంపిణీ విషయంలో ఎటువంటి ఆందోళనా చెందొద్దన్న విషయాన్ని రైతులకు తెలియజేయాలన్నారు. ఒకే రైతుకు ఎక్కువ మొత్తంలో ఎరువులు పంపిణీ చేయొద్దన్నారు. జిల్లాకు చేరుకున్న ఎరువులు సొసైటీలకు వెంటనే చేర్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషాను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా నుంచి ఎరువులు ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎరువుల కోసం సొసైటీలకు వచ్చే రైతులు ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడకుండా షామియానాలు వేయించాలని, కుర్చీలు, తాగునీరు వంటివి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, జిల్లా సహకార శాఖాధికారి ఆరిమిల్లి శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ సిహెచ్.ప్రసాద్ గుప్త, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

76,177 మెట్రిక్ టన్నుల ఎరువుల పంపిణీ

ఏలూరు: జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ గాను ఇప్పటివరకూ 76 వేల 177 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు అందించినట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. ఈనెల 10, 13వ తేదీల్లో మరో వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానున్నందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 2 వేల 400 మెట్రిక్ టన్నుల యూరియా, 2 వేల 982 మెట్రిక్ టన్నుల డిఎపి, 4 వేల 612 మెట్రిక్ టన్నుల ఎంఒపి, 13 వేల 320 మెట్రిక్ టన్నుల ఎన్‌పికె, 5 వేల 715 మెట్రిక్ టన్నుల ఎస్‌ఎస్‌టి, మొత్తం కలిపి 29 వేల 029 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలోని రైతులకు ఎటువంటి ఎరువుల కొరతా లేకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. ఎప్పటికప్పుడు మార్క్‌ఫెడ్, వ్యవసాయ, సహకార శాఖాధికారులను అప్రమత్తం చేయడంతో జిల్లాలో ఎరువులు పంపిణీలో ఎటువంటి సమస్యలూ లేకుండా రైతులకు సజావుగా ఎరువులు అందిస్తున్నామన్నారు.

ఏనుగులకుంట భూమిని కబ్జా కాకుండా కాపాడాలి

స్థలం వద్దే సిపిఎం ఆధ్వర్యాన ధర్నా - సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు


ఏలూరు నగరంలో రాణీనగర్ ఏనుగులకుంట భూమిని కబ్జా కాకుండా కాపాడి ప్రజల అవసరాలకు ఉపయోగించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సిపిఎం ఏలూరు నగర కమిటీ ఆ స్థలం వద్ద ధర్నా నిర్వహించింది. 38, 40 డివిజన్ల మధ్యలో ఉన్న రెండు వేల గజాల స్థలం రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసేందుకు బోగస్ పత్రాలు సృష్టించి భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, సమస్యను పరిష్కరించాలని రెండు వార్డుల ప్రజలు నినాదాలు చేశారు. ఈ ధర్నా ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ నివాసాల మధ్య ఉన్న ఖరీదైన చెరువును పూడిక తర్వాత ప్రజా అవసర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం చేపట్టడంలో నిర్లక్ష్యం కారణంగా భూ భకాసురులు భూమిని ఆక్రమించుకొనేందుకు ప్రయత్నాలు చేశారని చెప్పారు. జిల్లా కోర్టు తప్పుడు ఫిర్యాదును కొట్టివేసిందని, ప్రజలకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని తెలిపారు. కోర్టు తీర్పు వెలువడిన తర్వాత కాలయాపన చేయడం వల్ల నేటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ సమయాన్ని ఆసరాగా మార్చుకొని కబ్జాదారులు హైకోర్టులో కేసు వేసి స్టే ఆర్డర్ తెచ్చుకుని అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని భూ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హైకోర్టులో న్యాయవాది ద్వారా స్టేఆర్డర్‌ను ఎత్తి వేసేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. కోట్ల రూపాయల విలువైన ప్రజల భూమిని ఆక్రమణకు ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. తప్పుడు ఫిర్యాదులు చేసిన, బోగస్ పత్రాలు సృష్టించిన వారిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏనుగులకుంట భూమిలో వాటర్ హెడ్ ట్యాంక్, కమ్యూనిటీ హాల్ వంటి ప్రజా అవసరాలకు ఉపయోగపడే నిర్మాణాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పంపన రవికుమార్ మాట్లాడుతూ వేల మంది ప్రజలు కోరుకుంటున్నట్లు ఏనుగులకుంట భూమిలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రజా అవసరాలకు అనుగుణంగా జరగాలన్నారు. ఏలూరు ఎంఎల్‌ఎ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఏనుగులకుంట భూమిని కాపాడుకునేందుకు సిపిఎం పోరాడుతుందని చెప్పారు. భూమిని కబ్జా చేయాలని ప్రయత్నం చేస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ.శ్యామలారాణి, ఎం.ఇస్సాకు, జె.గోపి, అరుణ కుమారి, మీసాల సత్యం పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ఎస్‌టి, ఎస్‌టి, అట్రాసిటీ ప్రకారం పరిహారం అందించాలి

క్షతగాత్రులను పరామర్శించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



క్షతగాత్రులను పరామర్శిస్తున్న సిపిఎం నేతలు

వినాయక నిమజ్జనం సందర్భంగా కైకలూరులో ఆధిపత్య సామాజిక తరగతికి, జనసేన పార్టీకి చెందిన కొంతమంది కత్తులు, రాడ్లతో దళిత యువకులపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడాన్ని సిపిఎం జిల్లా నాయకులు తీవ్రంగా ఖండించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న దళిత యువకులను సిపిఎం నాయకుల బృందం ఆదివారం పరామర్శించింది. దాడికి గల కారణాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ దళితులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న జనసేన అధినాయకత్వం సామాజిక న్యాయం కోసం గొప్పగా మాట్లాడతారని, ఆచరణలో దళితులపై దాడులు జరుగుతున్నా నోరు మెదపరని విమర్శించారు. పథకం ప్రకారమే కైకలూరులో దళిత యువకులపై ఆధిపత్య సామాజిక తరగతికి చెందిన వారు దాడి చేశారని చెప్పారు. దళిత యువకులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్ట ప్రకారం దళిత యువకులకు పరిహారం అందించాలని, దళితులకు రక్షణ కల్పించాలని కోరారు. బాధిత దళితులకు సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామకృష్ణ, నగర కార్యదర్శి పంపన రవికుమార్, నాయకులు జె.గోపి, చక్రాల అమర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దానగూడెం ఘటనలో ఏడుగురు అరెస్టు

కఠినంగా శిక్షించేలా చర్యలు : ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కైకలూరు పట్టణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమంలో ఇద్దరు వ్యక్తులపై దాడి చేయడం హేయమని, ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఈ ఘటనపై విచారణ చేపట్టి ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ తెలిపారు. నగరంలోని డిఎస్‌పి కార్యాలయంలో ఆదివారం రాత్రి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ దానగూడెంలో గొడవ పక్కా పథకం మేరకే జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని డిఎస్‌పి స్పష్టం చేశారు. అజయ్‌పై దాడి చేసిన ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, ఆదివారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టామని తెలిపారు. దీనిపై మరింత లోతైన దర్యాప్తు చేస్తున్నామని, ఈ దాడుల్లో ఉన్న వ్యక్తులను అరెస్ట్ చేస్తామని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి తెలిపారు. ఈ కేసులో దానగూడేనికి చెందిన సామాజిక తరగతి వారు వంగవీటి మోహన్‌రంగా పుట్టినరోజు వేడుకల్లో ఆయన ఫొటోను కాలితో తొక్కారని, అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చిన కాపులపేటకు చెందిన వారు అంబేద్కర్ విగ్రహం చెప్పులతో విగ్రహం వద్దకు వచ్చారని, ఇలా గతం నుంచి వీరికి విభేదాలు ఉన్నట్లు గుర్తించామని డిఎస్‌పి చెప్పారు. నిందితులు ఎంతటి వారైనా, ఎటువంటి వారైనా వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు. డ్రోన్లు, సీసీ కెమెరాల సహాయంతో ఈ కేసులో దర్యాప్తును వేగవంతం చేశామని స్పష్టం చేశారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఘటనలో బాధితులకు న్యాయం చేయటంతోపాటు, నిందితులను కఠినంగా శిక్షించేలా చట్టం మేరకు చర్యలు చేపడతామని తెలిపారు. కైకలూరు దానగూడెంలో బాధితులను పరామర్శ పేరుతో కులఘర్షణలు రెచ్చగొట్టేలా ఎవరైనా ప్రయత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో కైకలూరు టౌన్ సిఐ కృష్ణ, కైకలూరు రూరల్ సిఐ రవికుమార్ పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా యాక్ట్ 30 అమలు

జిల్లాలో యాక్ట్ 30తో పాటు 144 సెక్షన్ అమలులో ఉందని, కైకలూరు పట్టణానికి, దానగూడేనికి బయటి వ్యక్తులు పరామర్శల పేరుతో వెళ్లేందుకు పోలీసుల అనుమతి తీసుకోవాలని డిఎస్‌పి శ్రావణ్ కుమార్ చెప్పారు. కుల ఘర్షణలు రెచ్చగొట్టేలా ఎవరైనా ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కైకలూరు కాపుల బజార్, దానగూడెంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని, రెండు గ్రూపులకు పూర్తిగా రక్షణ కల్పించేలా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. సుమారు 150 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. రెండు గ్రూపుల మధ్య చిచ్చురేపేందుకు కుట్రలు చేస్తే సహించేది లేదన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకించాలి

ఆర్‌ఎస్ ప్రథమ వర్ధంతి సభలో సిఐటియు నేతలు

ప్రజాశక్తి - ఉంగుటూరు



ఆర్‌ఎస్ సంతాప సభలో సిఐటియు నాయకులు

సిఐటియు, సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో స్వతంత్ర సమరయోధుడు మాజీ ఎంఎల్‌ఎ, కార్మిక ఉద్యమ నేత రుద్రారాజు సత్యనారాయణ(ఆర్‌ఎస్) ప్రథమ వర్ధంతి సభ ఆదివారం కైకరంలో నిర్వహించారు. జివి.కృష్ణారావు అధ్యక్షతన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయివేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్‌లకు కట్టబెడుతున్నారన్నారు. ఆంధ్ర హక్కు - విశాఖ ఉక్కు ప్రజల త్యాగాలు బలిదానంతో అప్పటి కేంద్ర ప్రభుత్వంతో పోరాడి సాధించుకున్నారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేసేందుకు పాములు కదుపుతుంటే అధికార తెలుగుదేశం, జనసేన నాయకులు వత్తాసు పడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో సిరా అప్పారావు, కొర్ని అప్పారావు, పూడి అబ్బులు, సంపంగి శ్రీను, అల్లు గోవింద, సిరా దుర్గారావు, సప్ప నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల్లో మాస్ కాపీయింగ్ లేకుండా చూడాలి

ఎపిపిఎస్‌సి కార్యదర్శి పి.రాజబాబు

ప్రజాశక్తి - ఏలూరు



పరీక్షలు పరిశీలిస్తున్న రాజబాబు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి పి.రాజబాబు అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీటీ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించి ఏలూరులోని పలు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలను ఆదివారం రాజబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలను ఎటువంటి సమస్యలు లేకుండా నిర్వహించాలన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, అభ్యర్థులకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని, తాగునీరు వంటివి అందించాలన్నారు. ఈ పరీక్షలు ఆఫ్‌లైన్ ఒఎంఆర్ విధానంలో ఉదయం పది గంటల నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు సెషన్లలో జరుగుతాయన్నారు. జిల్లాలోని 17 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 7078 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఉదయం సెషన్‌లో జరిగే పరీక్షలకు 6,128 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 6128 అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారని, 1017 మంది పరీక్షలకు హాజరు కాలేదన్నారు. ఏలూరు నరసింహారావుపేటలోని శ్రీచైతన్య కళాశాలలు, సిఆర్.రెడ్డి పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలలు, సత్రంపాడులోని జిల్లాపరిషత్ హై స్కూల్‌లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాలను, ఆయా కేంద్రాల్లో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలను రాజబాబు పరిశీలించారు. ఆయనతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యం కోసం అహర్నిశలూ కృషి చేయాలి

ఎఎస్‌పి సూర్యచంద్రరావు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

లక్ష్యం అనేది ఒకసారి ఏర్పరచుకుంటే దాని కోసం అహర్నిశలు కృషి చేయాలని ఎఎస్‌పి సూర్యచంద్రరావు విద్యార్థులకు సూచించారు. ఏలూరులోని ఆదిత్య ఇంటర్నేషనల్ హోటల్‌లో ఆదివారం విద్యార్థులకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ గంప నాగేశ్వరరావు వారి ఐసిఐ ఏలూరు హైమావతి క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మెగా ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 500 మంది ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు లైవ్ స్కిల్స్ డెవలప్‌మెంట్, మేనేజ్‌మెంట్ స్కిల్స్, గోల్ సెట్టింగ్స్‌పై ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలూరు అడిషనల్ ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో లక్ష్యం అనేది ఒకసారి ఏర్పరచుకుంటే దానికోసం అహర్నిశలు కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒక్క విద్యార్థి వారిలో ఉన్న భయాన్ని పోగొట్టి కష్టపడాలని సూచించారు. విద్యార్థుల వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ ట్రైనర్స్ డాక్టర్ ఆది, జెవి.శ్రీరామ్, గిరి ప్రసాద్, రాజేశ్వరి, హైమావతి క్లబ్ ప్రెసిడెంట్ నరసింహారావు, సెక్రటరీ శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సన్నాహాలు

గ్రామసభల నిర్వహణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు మండలంలో నిర్దేశిత రైల్వే గేటుల వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహశీల్దార్ పి.పూర్ణచంద్రప్రసాద్ తెలిపారు. ఉంగుటూరు, నాచుగుంట గేటుకు సంబంధించి ఈ నెల ఎనిమిదో తేదీన ఉంగుటూరు, నాచుగుంట పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించనున్నారు. అలాగే పదో తేదీన కైకరం, 11న వేల్పూరు, 12న వెల్లమిల్లి, బాదంపూడి పంచాయతీ కార్యాలయాల వద్ద సభలు నిర్వహించేందుకు ఇప్పటికే ఆయా గ్రామాల్లో మైక్ ప్రచారం కల్పించారు. ఓవర్ బ్రిడ్జి నిర్మాణాల కోసం రైల్వే ట్రాకును మూసేస్తే ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించి వాటిపై గ్రామసభలు అవగాహన కల్పించే నిమిత్తం ఈసభలు నిర్వహించనున్నారు.

విద్యుత్ తీగల సమస్య పరిష్కరించండి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


కిందకు వేలాడుతున్న తీగలు

పట్టణంలోని మారుతీ నగర్ ప్రధాన వీధిలో విద్యుత్ స్తంభాల మధ్య ఎక్కువ దూరం ఉండటంతో తీగలు కిందకు వేలాడుతూ చెట్ల కొమ్మలకు తగులుతున్నాయని, దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని సిపిఎం పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు అన్నారు. వర్షం పడితే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందన్నారు. మధ్యలో కొత్త స్తంభం ఏర్పాటు చేయకపోతే ప్రమాదం పొంచి ఉందన్నారు. విద్యుత్ శాఖాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని, సమస్య పరిష్కరించాలని కోరారు.

'రైతాంగానికి న్యాయం చేయలేని కూటమి'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రైతాంగానికి కూటమి ప్రభుత్వం న్యాయం చేయలేకపోతుందని దెందులూరు మాజీ ఎంఎల్ఎ అబ్బయ్య చౌదరి అన్నారు. ఏలూరులోని అశోక్ నగర్‌లో ఉన్న వైసిపి దెందులూరు పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియాతో పాటు రైతులకు ఉపయోగపడే ఎరువులు వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. బ్లాక్ మార్కెట్లో యూరియా అమ్మకాలను నియంత్రించాలని, ఎరువులు పక్కదోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఉచిత పంటల బీమాను అందరికీ వర్తింపజేయాలని కోరారు. ఈ నెల 9న జరిగే రైతన్నకు బాసటగా నిలుస్తూ ఆర్‌డిఒ కార్యాలయం వద్ద అన్నదాత పోరు నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ కలిసివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాలంటే రేషన్ కార్డు తప్పనిసరి అని టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. మండలంలోని అక్కిరెడ్డిగూడెం మాజీ సర్పంచ్ పులిబండ్ల లక్ష్మీనారాయణ, వలసపల్లి గ్రామంలో సర్పంచ్ చలసాని దామోదరరావు, టిడిపి గ్రామ అధ్యక్షులు మేదేపల్లి సురేంద్ర, వేల్పుచర్ల గ్రామంలో గరికిముక్కు నాని, చిల్లబోయినపల్లి గ్రామంలో సర్పంచ్ కందేపు రామగిరిరావు, కొండేపు బుజ్జియ్య, కాట్రేనిపాడు గ్రామంలో సర్పంచ్ గద్దె సుహాసిని మెహెన్‌రావు, ఎంపిటిసి సభ్యులు సూర్యదేవర నాగమంజుల శ్రీనివాసరావు, వేంపాడు మేజర్ డిసి ఛైర్మన్ రాపర్ల బాలకృష్ణ, చెక్కపల్లి గ్రామంలో సొసైటీ ఛైర్మన్ కాటేపల్లి ప్రసాద్, కాటేపల్లి సత్యనారాయణ, రమణక్కపేట గ్రామంలో రంగు వాసు, రంగు సత్యనారాయణ, గుడిపాడు గ్రామంలో టిడిపి గ్రామ అధ్యక్షులు మందలపు ధర్మరాజు, కొల్లి గంగరామ్, సొసైటీ ఛైర్మన్ కొల్లి కృష్ణయ్య, టిడిపి సూరేపల్లి గ్రామ అధ్యక్షులు మల్లిబాబు, ఎంపిడిఒ బసవరాజు అభ్యుత సత్యనారాయణ, ముసునూరు, చింతలవల్లి, చెక్కపల్లి గ్రామాల్లో సచివాలయం సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు.

యూరియాను మితంగా వాడాలి

మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు

ప్రజాశక్తి - పోలవరం

యూరియా మితంగా వాడి భూసారం కాపాడాలని మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు అన్నారు. మండలంలోని కృష్ణారావుపేట, పట్టిసీమ, గూటాల, ప్రగడపల్లి సొసైటీలకు 50.46 టన్నుల యూరియా దిగుమతి చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ యూరియా అవసరం ఉన్న రైతులు ఆధార్‌కార్డుతో వచ్చి అవసరానికి సరిపడా మాత్రమే యూరియా తీసుకెళ్లాలన్నారు. యూరియా తక్కువగా వాడడం వల్ల పంట దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. రెండో దఫా, మూడో దఫాకు సంబంధించి నానో యూరియా వాడకం వల్ల మంచి ప్రయోజనం ఉంటుందన్నారు. గుళికల యూరియా నానో యూరియాల వాడకం పద్ధతులు ప్రయోజనాల పట్ల రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి తహశీల్దార్ సొసైటీల సిఇఒలకు, సేల్స్ మ్యాన్లకు ఈ సందర్భంగా యూరియాకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.సాయిరాజు, సొసైటీ అధ్యక్షులు కొణతాల ప్రసాద్, శునకాని రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరతపై 9న రైతు పోరు

వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు మధుసూదనరావు

ప్రజాశక్తి - టి.నరసాపురం

జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఈ నెల తొమ్మిదో తేదీన యూరియా కొరతపై జరిగే రైతు పోరును జయప్రదం చేయాలని వైసిపి రైతు విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షులు వాసిరెడ్డి మధుసూదనరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న యూరియా కొరతపై వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు వైసిపి ఆధ్వర్యంలో రైతు పోరు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు రైతులు సుభిక్షంగా ఉండేవారని తెలిపారు. నేటి కూటమి ప్రభుత్వంలో రైతులు అన్ని విధాలుగా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. విత్తు నుంచి పంట అమ్మకం వరకు రైతుకు అన్నీ కష్టాలే అని పేర్కొన్నారు. నాటి వైఎస్ పాలన స్వర్ణయుగం అయితే నేటి కూటమి చంద్రబాబు పాలన రైతులకు కన్నీటి యుగంలా మారిందని తెలిపారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ధాన్యం పంటను తగ్గించాలని చంద్రబాబు వ్యాఖ్యానించడం సిగ్గుచేటైన విషయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు విడనాడి, పంటకు అవసరమైన యూరియాను రైతుకు సరిపడా అందించాలని, పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని పేర్కొన్నారు.

నేరాలు - ఘోరాలు

కోడిపందేల స్థావరంపై దాడి

నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - టి.నరసాపురం

కోడి పందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు, కోడి కత్తి స్వాధీనం చేసుకున్నారు. టి.నరసాపురం ఎస్ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బండివారిగూడెం పంచాయతీలోని సీతంపేట గ్రామ శివార్లలో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ జయబాబు తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు నిర్వాహకులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2,500 నగదు, కోడి కత్తి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - కుక్కునూరు

నాటుసారా స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకుని సారా స్వాధీనం చేసుకుని, బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు కుక్కునూరు సిఐ ఎం.రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ రాజారెడ్డి నేతృత్వంలోని పోలీసు బృందం కుక్కునూరు మండలం సీతానగరం గ్రామ శివారులోని కిన్నెరసాని వాగు ఒడ్డున నాటుసారా స్థావరంపై ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. మూడు బట్టీలను, 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

ఊపందుకున్న వంతెన మరమ్మతు పనులు

పటిష్టంగానే పిల్లర్లు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఏలూరు కాలువపై నారాయణపురం వద్ద వంతెన స్లాబు మరమ్మతులు ఊపందుకున్నాయి. బ్రిటీష్ కాలం నాటి ఈ బ్రిడ్జి జూన్ 15న పడమర వైపు కొంత మేరకు స్లాబు కుంగటంతో భారీ వాహనాలను ఆపేసి, కేవలం ద్విచక్ర వాహనాలు, పాదచారులు వెళ్లేందుకు మాత్రమే యంత్రాంగం ట్రాఫిక్ ఆంక్షలు విధించిన సంగతి విదితమే.. కొత్త వంతెన నిర్మాణానికి ఇప్పట్లో నిధులు వచ్చే అవకాశాలు లేవు. దీంతో ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు ప్రత్యామ్నాయ దారులైన దండు దారి పుంతను విస్తరింపజేశారు. పోలీసు స్టేషన్ నుంచి కాలువ గట్టు రోడ్డు మీదగా కొన్ని వాహనాలు వెళ్లాల్సి వస్తోంది. ప్రత్యామ్నాయ దారులను కొంత వరకు సిద్ధం చేయించినా నారాయణపురం వంతెన ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఈ ప్రత్యామ్నాయ దారులు తీర్చలేనిది. దీంతో ఐస్ పరిశ్రమల నిర్వాహకులు, ఆక్వా యజమానులు, గ్రామస్తులు అన్ని తరగతుల వారి సహకారంతో ఎంఎల్ఎ చొరవతో వంతెన మరమ్మతులు చేట్టారు. తొలుత వంతెన స్లాబు తొలగించారు. బ్రిటీష్ వాళ్లు లండన్ నుంచి తీసుకొచ్చిన పొడవైన ఇనుప కమ్మెలను పిల్లర్లుపై ఉంచి దానిపై ఐరన్ ఊచలతో శ్లాబు వేశారు. అడుగున ఉన్న ఇనుక కమ్మెలు ఇరు పక్కల మూడు చోట్ల తుప్పుపట్టాయి. మిగతా కమ్మెలు చాలా దృఢంగా ఉన్నాయి. దీంతో తుప్పట్టిన కమ్మెలకు సపోర్టుగా ఇనుక యాంగిలర్‌తో వెల్డింగు చేసి వాటిని యధా స్థానంలో ఉంచనున్నారు. దానిపై ప్రత్యేకంగా తయారు చేయించిన ఐరన్ షీట్‌ను కమ్మెలపై వెల్డింగ్ చేసి దానిపై ఐరన్ ఊచలతో కాంక్రీట్ స్లాబు వేయనున్నారు. కమ్మెలకు తుప్పు పట్టకుండా ప్రత్యేక పెయింట్ వేస్తున్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో కాంక్రీట్ స్లాబు వేసేందుకు అనుగుణంగా పనులు శరవేగంగా చేయిస్తున్నామని ఎంఎల్ఎ ఎమ్మెల్యే పత్సమట్ల తెలిపారు. కాగా వంతెన మరమ్మతులు చేసే ముందే జనాలు వంతెన దాటేందుకు కర్ర వంతెన లేదా, బెయిలీ బ్రిడ్జో ఏర్పాటు చేసి ఉంటే ఇబ్బందులు తప్పవని అంటున్నారు. వంతెన అవతలు ఉన్నవారు. ఇటు ఆటు వెళ్లేందుకు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని ఆటోకి ఒకవైపు మనిషికి రూ.20లు ఛార్జీ వసూలు చేస్తున్నారని ఇది సామాన్యులకు మరింత భారంగా మారింది.


చురుగ్గా సాగుతున్న వంతెన మరమ్మతు పనులు

దళితులపై దాడి చేసినవారిని శిక్షించాలి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జంగారెడ్డిగూడెం బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. కైకలూరు మండలం దానగూడెం మాల దళితులపై జనసేన పార్టీ కాపు సామాజిక తరగతికి చెందినివారు అత్యంత కిరాతకంగా మారణాయుధాలతో దాడి చేసి గాయపరిచారన్నారు. వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రముఖ విద్యావేత్త డాక్టర్ అలుగు ఆనంద్ శేఖర్, మాల మహానాడు రాష్ట్ర లీగల్ సెల్ లాయర్ తొరలపాటి శ్రీనివాస్, కలపాల రాజకుమార్ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకొచ్చినప్పటి నుంచి దళితులపై, దళిత చట్టాలపై, రాజ్యాంగంపై దాడి కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా దళితులపై దాడులు కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చినప్పటి నుంచి దళితులపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. ఉభయ గోదావరి జిల్లాలో గతంలో గరుగపర్రు గ్రామంలో చుండూరు కారంచేడు ఉద్యమాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తు చేసుకోవాలన్నారు. కైకలూరు మండలం దానగుడెం గ్రామంలో కలెక్టర్, ఎస్‌సి కమిషన్ పర్యటించి 144 సెక్షన్ ఎత్తివేయాలని, గ్రామాల్లో శాంతిభద్రత సమస్యలు పరిష్కరించాలని, దళితులకు ధైర్యం చెప్పి, గాయాలపాలైన వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. లేకపోతే తెలుగుదేశం కూటమి ప్రభుత్వం దళితుల వ్యతిరేకిగా మిగిలిపోవాల్సి వస్తుందన్నారు. దళితులపైన ఎలాంటి పోలీసు ఒత్తిడిలు లేకుండా నిజాయితీగా ఎలాంటి పక్షపాతం లేకుండా దళిత మాల యువకులపై దాడి చేసిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు 307 కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేసి జనసేన పార్టీ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నేత ఫ్రాన్సిస్

ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేయాలి

ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ వైస్ ఛైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం


మండలంలోని మర్రిగూడెం గ్రామంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు కొమరం వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివాసీ ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ వైస్ ఛైర్మన్, జిల్లా ఆదివాసీ ఐక్య కార్యచరణ కమిటీ ఛైర్మన్ మొడియం శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో జిల్లా షెడ్యూల్ ప్రాంత ఆదివాసీలకు తీవ్రమైన అన్యాయం చేసిందని, షెడ్యూల్ ప్రాంతాన్ని మైదాన ప్రాంత జిల్లాతో కలపటం వల్ల ఏజెన్సీ చట్టాలు అమలు కావడం లేదని వాపోయారు. సిఎం చంద్రబాబు తాను ఎన్నికల్లో విజయం సాధిస్తే రంపచోడవరం కేంద్రంగా మరొక ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. రాష్ట్రంలో మొత్తం షెడ్యూల్ ప్రాంతాన్ని మూడు జిల్లాలుగా చేయాలని, ఇప్పటికే ఉన్న మన్యం జిల్లా, ఎఎస్ఆర్ పాడేరు జిల్లాలతో పాటు రంపచోడవరం కేంద్రంగా మరో ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేసి పోలవరం, రంపచోడవరం నియోజకవర్గాల షెడ్యూల్ ప్రాంతాన్ని, పోలవరం ప్రాజెక్టు ముంపు మండలాలు, విలీన మండలాలు, ఆ ప్రాంతానికి ఆనుకుని ఉన్న మైదాన ప్రాంతాల మండలాల్లోని ఆదివాసీ గ్రామాలను కలుపుతూ ప్రత్యేక ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తెల్లం రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి తెల్లం గంగరాజు, జిల్లా కార్యదర్శి కోర్స నాగేశ్వరరావు, కుంజా రమేష్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షులు తెల్లం లక్ష్మణరావు, బుట్టాయగూడెం మండలాధ్యక్షులు రవ్వా బసవరాజు, ప్రధాన కార్యదర్శి పోడియం కొవ్వాడయ్య, జీలుమిల్లి మండల ప్రధాన కార్యదర్శి కోర్స తులసిరావు, కార్యదర్శి రాంబాబు, ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తెల్లం శ్రీనివాసరావు, మర్రిగూడెం ఆదివాసీ నాయకులు మడకం దుర్గారావు, చోడెం దుర్గారావు, మడకం రమేష్, కొమరం రాము, బుద్దులు నాగేంద్ర, ఆదివాసీ యువజన సంఘం అధ్యక్షులు సోదెం నవీన్ కుమార్, మర్రిగూడెం గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అంకితభావంతో పనిచేస్తేనే ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి - దెందులూరు

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం కలెక్టరేట్ గోదావరి ఫంక్షన్ హాలులో మండలంలోని ఉపాధ్యాయ సంఘాలు, మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఎంఇఒ-1 బి.త్రిపుర సుందరీదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తేనే ఉత్తమ ఫలితాలు వస్తాయని, మండలానికి మంచి పేరు వస్తుందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంఇఒ-2 వి.అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని పాఠశాలలు ఉత్తమ విద్యాలయాలుగా నిలవడానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. ఎంపిడిఒ, తహశీల్దార్ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రధాన ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు వడ్లపట్ల మురళి, ఎస్‌టియు మండల శాఖ అధ్యక్షులు పరసా నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ పాఠశాల దీటుగా పనిచేస్తున్నాయని, మన విద్యాశాఖ మంత్రి లోకేష్ సంస్కరణలు విద్య పరిపుష్టికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పాఠశాలకు ఇస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని, విద్యాశాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం సంఘ నాయకులు ప్రవీణ్ కుమార్, రమేష్, ప్రభాకర్, కృష్ణ, థామస్ విద్యాసాగర్, కె.శ్రీనివాస్, ధనకాంత, మిరియాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



అవార్డుల ప్రదానోత్సవంలో ఎంఇఒలు, ఉపాధ్యాయులు

అందుబాటులో యూరియా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని రైతులు ఎటువంటి ఇబ్బంది పడవద్దని, యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి ప్రియాంక తెలిపారు. మండలంలోని బుట్టాయగూడెం పిఎసిఎస్‌లో 12.60 మెట్రిక్ టన్నులు, రెడ్డిగణపవరం పిఎసిఎస్‌లో 12.60, బుట్టాయగూడెం డిసిఎంఎస్‌లో 6.60 మెట్రిక్ టన్నులు, ప్రయివేట్ డీలర్స్ వద్ద 11.2 మెట్రిక్ టన్నుల యూరియ నిల్వలు ఉన్నాయని తెలిపారు. అవసరమైన రైతులు గమనించాలని తెలిపారు.

పది కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ


ప్రజాశక్తి - ముదినేపల్లి

మేము సైతం మీకోసం మేమున్నాం టీమ్ ఆధ్వర్యంలో ఆదివారం వికలాంగులకు, రోడ్డు ప్రమాద బాధిత పది కుటుంబాలకు పలువురు దాతల సహకారంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. హైవే ఆర్ఇ గూడపాటి భానుప్రసాద్ తన మనవరాలు పాశర్ల మిహిర పేరున ఈ నెల నుంచి ప్రతినెలా రెండు కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందిస్తానని తెలిపారు. అలాగే కైకలూరులో ప్రముఖ న్యాయవాది పిచికల పవన్ కాంత్ పాల్గొని ఒక కుటుంబానికి తన వంతుగా నిత్యావసర సరుకులు అందించారు. బిజెపి జిల్లా నాయకులు కోటప్రోలు కృష్ణ పాల్గొని తన తండ్రి కీర్తిశేషులు కోటప్రోలు పూర్ణ పేరుమీద ఒక కుటుంబానికి నిత్యావసర సరుకులు, ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు తన వంతుగా ఒక కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వీరభద్రరావు మాట్లాడుతూ ఈ రోజుల్లో తన స్వార్థం తను చూసుకోకుండా ఎదుటివారి కష్టాలను తమ కష్టాలుగా భావించి మేము సైతం మీకోసం మేమున్నం టీం మొవ్వ ఫణింద్ర, సభ్యులు ముందుకు రావడం అభినందించదగ్గ విషయమన్నారు. మేము సైతం మీకోసం మేమున్నాం టీమ్ సభ్యులు మిగిలిన కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ రవితేజ, తణుకుల రవితేజ, భూపతి రవీంద్ర, పాగోలు విజయసాగర్, ధర్మ, విజయ్, మధు, సాగర్ పాల్గొన్నారు.

ఉత్తమ టీచర్ అవార్డు గ్రహీతలకు సత్కారం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలైన దంపతులు కూన రాంబాబు, కర్రి వెంకటలక్ష్మిలను ఆదివారం కైకరం సుందర సీతారామస్వామి కళింగ రామాలయం తరపున సన్మానించారు. రాంబాబు సొంతూరు కైకరమే. ఆయన నారాయణపురం జెడ్‌పి హైస్కూల్లో పని చేస్తున్నారు. అలాగే ఆయన భార్య వెంకటలక్ష్మి నాచుకుంట పరిధి కొత్తగూడెం ఎలిమెంటరీ పాఠశాలలో పని చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన భార్యాభర్తలు ఇరువురు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఎంపికావటం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.


దంపతులను సత్కరిస్తున్న కైకరం గ్రామస్తులు

నూజివీడును ఎన్‌టిఆర్ జిల్లాలో కలపాలి

నేడు మంత్రికి, కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలపాలని కోరుతూ నూజివీడు స్థానిక అమరభవన్‌లో కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ నెల ఎనిమిదో తేదీ సోమవారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్‌కు, ఏలూరులో కలెక్టర్‌కు, మంత్రి వర్గ త్రిసభ్య కమిటీ మెంబర్ నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సాధన సమితి (జెఎసి) గౌరవ అధ్యక్షులు చలసాని వెంకట రామారావు, సాధన సమితి అధ్యక్షులు మరీదు శివరామకృష్ణ, ట్రెజరర్ చాట్ల పుల్లారావు, నాయకులు ఎం.సునీల్ కుమార్, ఎర్రంశెట్టి రాము, ఉమామహేశ్వరరావు, ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలి

కొయ్యలగూడెం :కార్మికులంతా తమ హక్కుల కోసం సంఘటితంగా ఉండి పోరాడి సాధించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య తెలిపారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో ఆదివారం ఎఐటియుసి సమావేశం సిపిఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మన్నవ కృష్ణచైతన్య, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, గిరిజన సమైక్య రాష్ట్ర కార్యదర్శి కారం దారయ్య, హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం ఎఐటియుసి, సిపిఐ 44 చట్టాలు సాధించుకుంటే, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం మాత్రం నాలుగు కోడ్‌లు చేసిందన్నారు. 24 గంటలు పని ఒత్తిడి తగ్గించాలని ఆనాడు కార్మికులంతా ఒక్కటై పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాలు ఇప్పుడు అమలవుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మళ్లీ కార్మికులకు 12 గంటలు పని దినాలు చేయడానికి సిద్ధపాటు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బండి వెంకటేశ్వరరావు, కారం దారయ్య మాట్లాడారు. అనంతరం కృష్ణచైతన్య ఆధ్వర్యంలో ఎఐటియుసి జెండాలను కప్పి పార్టీలోకి కార్మికులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయక కార్యదర్శి లక్క లక్ష్మణరావు, దుగ్గిరాల నారాయణరావు, వెలగల నాని పాల్గొన్నారు.

యూరియా కేటాయింపులు పెంచాలి

ఎంపిపి సత్యనారాయణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఖరీఫ్ వరికి అవసరమైనంత మేరకు ప్రభుత్వం యూరియాను సరఫరా చేయాలని ముదినేపల్లి ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. యూరియా కోసం రైతులు సహకార సంఘాల వద్ద, ప్రయివేట్ ఎరువుల డీలర్ల వద్ద పడిగాపులు పడి ఉండాల్సి వస్తుందన్నారు. అదివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. యూరియా కొరత లేదని అధికారులు చెబుతూ ప్రభుత్వాన్ని, రైతులను పక్కతోవ పట్టిస్తున్నారని విమర్శించారు. రైతులకు సరిపడనంత యూరియా అందించాలన్నారు. పొలం పనులు వదిలి యూరియా కోసం పంపిణీ కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు పడుతున్నారన్నారు. ఈ నెల తొమ్మిదో ఉదయం పది గంటలకు యూరియా కొరతపై ఏలూరు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్‌జియుకెటిలో క్వాంటం లెక్చర్ సిరీస్ ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నేటి యువత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వైపు చురుగ్గా వెళుతున్నట్టే క్వాంటం టెక్నాలజీస్ వైపు కూడా మొగ్గు చూపించాలనే ఉద్దేశంతో ఆర్‌జియుకెటి యాజమాన్యం ఆదివారం క్వాంటం లెక్చర్ సిరీస్ ప్రారంభించారు. విద్యార్థులకు క్వాంటం టెక్నాలజీస్ పైన అవగాహన కల్పించి వారి సందేహాలను తొలగించారు. ఆర్‌జియుకెటి నూజివీడు రిజిస్ట్రార్, డైరెక్టర్ అమరేంద్రకుమార్, ఎం డాక్టర్ బి.లక్ష్మణరావు, సెంట్రల్ డిఒఎ శ్రావణి, డీన్ ఆఫ్ ఐటిపి పి.శ్యామ్, డిఒఎ డాక్టర్ ఎస్.చిరంజీవి, క్వాంటం లెక్చర్ సిరీస్ కన్వీనర్ పావని, ఇతర ఉపాధ్యాయుల కృషి వల్ల క్వాంటం లెక్చర్ సిరీస్ విజయవంతంగా ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొదలుపెట్టిన క్వాంటం వ్యాలీ విద్యార్థుల ప్రగతికి తోడ్పడుతుందని యాజమాన్యం ఆశిస్తున్నారు.

సొసైటీల్లో తనిఖీలు

ప్రజాశక్తి - దెందులూరు

యూరియా సరఫరాపై రైతుల అభిప్రాయాలు, సొసైటీల్లో పంపిణీ గురించి తెలుసుకునేందుకు జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ భాషా ఏలూరు డివిజనల్ వ్యవసాయ అధికారులతో దెందులూరు మండలం కొవ్వలి, పెదవేగి మండలం పెదకడిమి సొసైటీలను ఆదివారం తనిఖీ చేశారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. జిల్లాలో ప్రతి సొసైటీలో ఎరువులు ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందనవసరం లేదని, దెందులూరు మండలంలో 22 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. కొవ్వలి సొసైటీ, దెందులూరు గ్రోమోర్ సెంటర్, రామారావుగూడెం, చల్ల చింతలపూడి డీలర్ల వద్ద అందుబాటులో ఉందన్నారు. పెదపాడు సొసైటీ, గ్రోమోర్‌లో 25 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. పెదవేగి మండలంలో 17 మెట్రిక్ టన్నుల యూరియా పెదకడిమి, మనగ్రోమోర్, ముండూరు సొసైటీల్లో, శనివారపుపేట సొసైటీలో నాలుగు టన్నులు, ఏలూరు డిసిఎంఎస్‌లో 68 టన్నులు ఉందని తెలిపారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో సత్రంపాడులోని ఆదిత్య కళాశాల తరపున పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా వృద్ధులతో మమకారంతో మెలగడం, వారి అవసరాలను గుర్తించి సహాయం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. సామాజిక సేవ ద్వారా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం జరుగుతుందని, వృద్ధుల పట్ల ఆదరాభిమానాలు పెంచుకోవడంలో ఇలాంటి కార్యక్రమాలు సహకారంగా ఉంటాయన్నారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్సు, వాలంటీర్లు కూడా తమ అనుభవాలను పంచుకుంటూ భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్-ఎస్ ఆఫీసర్ కె.హరిబాబు, ఎఒ సిహెచ్.కృష్ణ, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ముఠా హమాలీ కార్మికుల మహాసభ స్థానిక ముఠా కార్మిక భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎఐటియుసి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ ముఠా హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల కార్మిక హక్కులపై నిరంకుశ దాడులకు పాల్పడుతున్న కార్పొరేట్ తరగతుల తీరుపై ఉద్యమించడానికి కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా దేశంలో అసమానతలు, పేదరికం పెరిగిపోతున్నాయని, పేదల విషయంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండగా ధనికులు మరింత ధనికులుగా మారుతున్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే ఈ రకమైన వైఖరిని అవలంభిస్తోందని విమర్శించారు. సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరలించడం కోసం మతతత్వ రాజకీయాలకు మోడీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూజివీడు ముఠా యూనియన్ గౌరవ అధ్యక్షులుగా చలసాని వెంకట రామారావు, అధ్యక్షులుగా ఎం.రాంబాబు, వైస్ ప్రెసిడెంట్‌గా పి.క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శిగా కె.దుర్గాప్రసాద్, సహాయ కార్యదర్శిగా పి.నాగేశ్వరరావు, ట్రెజరర్‌గా టి.శ్రీరాములు, కమిటీ సభ్యులుగా జి.శ్రీనివాసరావు, కె.వెంకట్రావు, ఎ.సత్యనారాయణ, ఎం.సురేష్, కె.అవతారం, ఎస్.కన్నమనాయుడు, కె.రామకృష్ణ, ఎం.లక్ష్మణరావు, ఎస్.శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ఏలూరు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసడాంగే, ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, సిపిఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి ఎం.నరసింహ, ముఠా కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.